ఠాణాల పరిధి పునర్విభజన

- జూబ్లీహిల్స్‌లో కొంతభాగం మధురానగర్‌లో విలీనం
- ఫిలింనగర్‌లోని ఓ ప్రాంతం కొత్తగా ఏర్పడిన టోలిచౌకిలోకి..
- కసరత్తు పూర్తి చేసి సరిహద్దుల నిర్ణయం
- అధికారికంగా త్వరలో ఆదేశాలు



మధురానగర్ పోలీస్‌స్టేషన్

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు ఆ శాఖ ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఇందులో పోలీస్‌స్టేషన్‌ల పెంపు, పునర్విభజన వంటి అంశాలు కీలకంగా మారాయి. 2023 రాష్ట్ర అవతరణ రోజు నగరంలో కొత్తగా 24 పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. దశల వారీగా అన్ని ఠాణాలు అందుబాటులోకి వచ్చాయి. పాత ఠాణాల పరిధులను తగ్గిస్తూ కొత్తవి ఏర్పాటు చేశారు.

ఉన్నతాధికారులతో సర్వే..

పశ్చిమ మండలం పరిధిలో బోరబండ, మధురానగర్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ ఠాణాలు కొత్తగా ప్రారంభమయ్యాయి. పాత పోలీస్‌స్టేషన్‌ల పరిధులను పునర్విభజన చేసి సరిహద్దులు నిర్ణయించారు. అప్పట్లో ఉన్న రాజకీయ పరిణామాలు ఇతర అంశాల నేపథ్యంలో కొన్ని ఠాణాల పరిధులు చాలా చిన్నగా ఉన్నాయనే ఆరోపణలు వినిపించాయి. రోజులు గడుస్తున్నా కొద్ది కొత్తగా ఏర్పడిన పోలీసుస్టేషన్‌లు కూడా బిజీగా మారిపోయాయి. బంజారాహిల్స్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ లాంటి పోలీసుస్టేషన్‌లతో సమానంగా కొత్త వాటిల్లో కేసులు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఠాణాలు దూరంగా ఉన్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఉన్నతాధికారులు మరోసారి పునర్విభజన వైపు మొగ్గు చూపించారు. ఇందుకోసం ముగ్గురు ఉన్నతాధికారులతో అంతర్గతంగా సర్వే నిర్వహించిన అనంతరం పశ్చిమ మండలం పరిధిలో రెండు ఠాణాల సరిహద్దులు మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఆయా స్టేషన్‌ల సిబ్బందికి వివరించారు. త్వరలోనే అధికారికంగా ఆదేశాలు ఇచ్చేందుకు కసరత్తు మొదలు పెట్టారు.

ఇప్పటికే కేసులు అధికం...

మధురానగర్ పోలీసుస్టేషన్ ఏర్పడినప్పుడు దాన్ని 'సి' కేటగిరిగా అప్పట్లో అధికారులు గుర్తించారు. ఇక్కడ క్రైం రేటు చూస్తుంటే ఉన్నతాధికారులు ఆశ్చర్యపోతున్నారు. నగరంలో అత్యధిక ఎఫ్ఐఆర్‌లు అయ్యే ఠాణాలు పంజాగుట్ట, సంజీవరెడ్డినగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పేర్లే అధికంగా వినిపిస్తుంటాయి. వీటితో సమానంగా మధురానగర్‌లో కేసులు నమోదవుతున్నాయి. బస్తీలు అధికంగా ఉండడంతో పాటు రాజకీయ వివాదాలు ఈ ఠాణా పరిధిలో ఎక్కువగానే ఉన్నాయి. ఈ క్రమంలో ఉన్న ప్రాంతాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సతమతమవుతున్న పోలీసులకు ఇప్పుడు కొత్త ప్రాంతాలు వచ్చి చేరడం సవాల్‌గానే మారుతుంది. ఏదేమైనా అధికారికంగా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందగానే మార్పిడి ప్రక్రియ పూర్తి చేయాలని ఆయా ఠాణాల సిబ్బంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మధురానగర్‌కు కొత్త ప్రాంతాలు

జూబ్లీహిల్స్, సంజీవరెడ్డినగర్ పోలీసుస్టేషన్‌ల నుంచి కొన్ని ప్రాంతాలను తీసుకొని గతంలో పోలీసులు మధురానగర్ ఠాణాగా ఏర్పాటు చేశారు. ఇందులో కాలనీలు, బస్తీలు అధికంగానే ఉన్నాయి. కానీ, పరిధి చాలా చిన్నగా ఉందనే వాదనలు వినిపించాయి. కనీసం నాలుగు సెక్టార్‌ల కింద విభజించలేని విధంగా పరిస్థితి ఉన్నట్టు ఠాణా సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే, అప్పుడు ఠాణా ఏర్పడడంతో మరోసారి మార్పులు, చేర్పులు చేస్తే ప్రజలు తికమక పడే ప్రమాదం ఉందని అధికారులు వాయిదా వేశారు. కొత్త స్టేషన్ ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తుండడంతో మరోసారి సరిహద్దులు మార్చితే బాగుంటుందని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ కింద ఉన్న కొన్ని ప్రాంతాలను మధురానగర్‌లో కలపాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇందిరానగర్ చౌరస్తాలో ఉన్న సాయి వైన్స్ నుంచి అటు కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, యూసుఫ్‌గూడ బస్తీ ఇటు శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్డు, ఏటీఎం చౌరస్తా, శాలివాహన నగర్ ఓ వైపు గణపతికాంప్లెక్స్, ఔట్ పోస్టు తదితర ప్రాంతాలను మధురానగర్‌లో కలుపుతున్నట్టు అధికారులు ఇప్పటికే సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అధికారిక మార్పిడి మాత్రమే మిగిలి ఉంది. దీనివల్ల వీఐపీల తాకిడి ఉండే జూబ్లీహిల్స్‌పై పని ఒత్తిడి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. అంతేగాకుండా స్థానికులకు కూడా పోలీసుస్టేషన్ దగ్గరగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

టోలిచౌకిలోకి....

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గోల్కొండ పోలీసుస్టేషన్‌ల సరిహద్దులు మార్చి ఫిలింనగర్ పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.12 నుంచి జూబ్లీహిల్స్‌లోని కొన్ని ప్రాంతాలు, అపోలో ఆస్పత్రి, ఫిలింనగర్ కాలనీలు, 18 బస్తీలు, టోలిచౌకి, సబ్జాకాలనీ, షేక్‌పేట ప్రాంతాలతో ఫిలింనగర్ ఏర్పడింది. ఇప్పుడు కొత్తగా టోలిచౌకి పోలీసుస్టేషన్ ఏర్పడడంతో ఫిలింనగర్ ఠాణా పరిధిలోని టోలిచౌకితో పాటు కొన్ని ప్రాంతాలను కొత్త స్టేషన్‌లో విలీనం చేసింది. దీంతో ఫిలింనగర్ ఠాణా పరిధి పూర్తిగా తగ్గుతుందని కొంతమంది అధికారులు అంటున్నారు.


చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

యూసుఫ్‌గూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచించారు. శుక్రవారం ఆయన యూసుఫ్‌గూడ, షేక్‌పేట డివిజన్లకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే, 38 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌కుమార్, సంతోష్ ముదిరాజ్, నర్సింగ్‌దాస్, అజార్, అమ్మాజీ, అరుణ, మాధవి పాల్గొన్నారు.

టీడీపీ అసెంబ్లీ పరిశీలకుల నియామకం

రాంనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అసెంబ్లీల వారీగా పరిశీలకులను నియమించింది. ముషీరాబాద్ నియోజకవర్గం పరిశీలకులుగా కె.పరుశురామ్, పి.వీరబాబు, అంబర్‌పేటకు పి.బాల్‌రాజ్‌గౌడ్, లాయక్, ఖైరతాబాద్‌కు రాజేంద్రప్రసాద్, మల్లికార్జున్, జూబ్లీహిల్స్‌కు ఎంకే బోస్, సి.విఠల్, సనత్‌నగర్‌కు నల్లెల కిషోర్, మేడిపల్లి శ్యామ్‌సుందర్, నాంపల్లికి ఎం.రాజు, సత్యనారాయణ, సికింద్రాబాద్ నియోజకవర్గం పరిశీలకులుగా జాకబ్, ఎ.బి.ఆర్.మోహన్‌రావును నియమించారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు


పీడియోగల్లీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

పంజాగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ దేదీప్య అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రహ్మత్‌నగర్ పీడీయోగల్లీలో జలమండలి మేనేజర్ సూర్యతో కలిసి ఆమె పర్యటించారు. సరిపోను నీరు రావడం లేదని, కొన్నిచోట్ల కలుషిత నీరు వస్తుందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆమె జలమండలి అధికారులకు సూచించారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ శ్యామ్‌రావు, స్థానిక నాయకులు సత్యనారాయణ, దశరథ, జనార్దన్, యాదగిరి, తదితరులు ఉన్నారు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

యూసుఫ్‌గూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న ఓ మహిళ పట్ల ముగ్గురు అసభ్యంగా ప్రవర్తించారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన సోమత దామవరపు నాగసాయి కుటుంబంతో హైదరాబాద్‌కు వచ్చారు. పెద్దమ్మ గుడికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. రహ్మత్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన తర్వాత వారు రెస్ట్‌రూమ్‌కు వెళ్లారు. అక్కడ మద్యం తాగుతున్న సంతోష్, ఉమేష్, సందీప్ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. వెంటనే సదరు మహిళ భర్త సహకారంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.13లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా ఓ వ్యక్తి లేజర్ 247 అనే మొబైల్ యాప్ లో బెట్టింగ్ పెడుతున్నట్టు తేలింది. అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా సింగారిబస్తీకి చెందిన పి.వేన్నారు అని తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగిలించి నగదు డ్రా

యూసుఫ్‌గూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి మొబైల్ దొంగిలించి ఆన్‌లైన్ ద్వారా నగదును డ్రా చేశాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన పావూరి రాజేష్ చౌదరి స్నేహితులు యువరాజ్, గురునాథరావుతో కలిసి ఉంటున్నారు. ఏప్రిల్ 27న మిద్దెపై పడుకున్న రాజేష్ చౌదరి మొబైల్‌ను గురునాథరావు దొంగిలించాడు. ఏప్రిల్ 27న రూ. 20 వేలు, మే 2న రూ.28 వేలు, మరోసారి రూ.2వేలు డ్రా చేశాడు. ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం తెలుసుకొని మధురానగర్ పోలీసులకు రాజేష్ చౌదరి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పీవీ రాంప్రసాద్‌రావు



పంజాగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పీవీ రాంప్రసాద్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన బోస్ కిరణ్ గాంధీనగర్ పీఎస్‌కు బదిలీ అయ్యారు.

ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోషం



బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోషం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్ గోషామహల్‌కు బదిలీ అయ్యారు. 2007 బ్యాచ్‌కు చెందిన సంతోషం గతంలో బంజారాహిల్స్ ఎస్ఐగా విధులు నిర్వహించారు. పదోన్నతి లభించిన అనంతరం వివిధ ఠాణాల్లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.


అమర్‌నాథ్‌కు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

ఎస్ఐకి సాదర వీడ్కోలు

ఖైరతాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో 41 సంవత్సరాల పాటు సేవలందించి మంచి అధికారిగా గుర్తింపు పొందిన ఎస్ఐ అమర్‌నాథ్‌కు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, డీఐ విఘ్నేశ్వర్, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బంది ఆయనకు పోలీస్‌స్టేషన్‌లో పూలబొకేలు ఇచ్చి వీడ్కోలు చెప్పారు. అమర్‌నాథ్ ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చి ఎన్నో ఫిర్యాదులను పరిష్కరించారని ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ గుర్తు చేసుకున్నారు.

స్విమ్మింగ్ పూళ్లలో క్లోరినేషన్ చేయాలి

ఖైరతాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్విమ్మింగ్ పూళ్లలో అవసరం మేరకు క్లోరినేషన్ చేయాలని, శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ క్రీడావిభాగం డిప్యూటీ డైరెక్టర్ రహీనాబేగం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఖైరతాబాద్ జోన్‌లోని పలు క్రీడా కాంప్లెక్స్‌లతోపాటు విజయనగర్‌కాలనీ, అమీర్‌పేట తదితర స్విమ్మింగ్ పూళ్లను ఆమె పరిశీలించారు. కోచ్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సన్నబియ్యం పంపిణీలో తెలంగాణ నెం.1

ఎర్రగడ్డ, మే 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం చరిత్రకెక్కిందని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ మోసిన్ ఖురేషి అన్నారు. ఆనంద్‌నగర్‌లోని రేషన్‌షాపులో సన్నబియ్యం పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణ కుమార్ మాట్లాడుతూ పేదలకు సన్నబియ్యం పథకం ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ మహ్మద్ సర్దార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదగిరి యాదవ్, ఆకాష్, బీక్షపతి పాల్గొన్నారు.

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో శుక్ల యజుర్వేద కాణ్వ శాఖ హవనం నిర్వహించారు. శ్రీ విజయశంకరదేశిక ట్రస్ట్ వేద పాఠశాల విద్యార్థులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ జగద్గురు శంకర భగవత్పాద పూజ, వేద స్వస్తి పూజలు నిర్వహించినట్లు వేద పండితులు జ్యోతిశ్చంద్రశర్మ తెలిపారు. చిర్రావూరి శివరామకృష్ణ వేదార్థోపన్యాసంలో 50 మందికి పైగా వేద పండితులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు మురళీధరశర్మ పాల్గొన్నారు.

సగర భగీరథ మహర్షి జయంతి పోస్టర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): సగర భగీరథ మహర్షి రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం కూడా వచ్చే సంవత్సరం నుంచి అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 4న రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం, సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, సగర ఆత్మగౌరవ భవన్ ట్రస్ట్ చైర్మన్ మారుతిసాగర్, సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సత్యం సగర తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 251 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి, దివ్య

బేగంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 251 దరఖాస్తులు వచ్చాయి. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రత్యేకాధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 75, విద్యుత్ శాఖకు 23, రెవెన్యూ 46, ప్రవాసి ప్రజావాణికి 5, ఇందిరమ్మ ఇళ్ల కోసం 41, ఇతర శాఖలకు చెందిన 61 దరఖాస్తులు అందినట్టు వారు తెలిపారు.

టౌన్‌ప్లానింగ్‌లోని మున్షీలపై చర్యలు తీసుకోవాలి


విజయలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న నవీన్‌కుమార్

బేగంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): టౌన్‌ప్లానింగ్‌లో అవినీతికి పాల్పడుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న చైన్‌మన్(మున్షీ)లపై చర్యలు తీసుకోవాలని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి శుక్రవారం లిఖిత పూర్వక ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ బేగంపేట, సికింద్రాబాద్ సర్కిల్ ప్రాంతాల్లో 15 నుంచి 20 సంవత్సరాలుగా ఒకేచోట పనిచేస్తున్న చైన్‌మన్‌లు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రధానంగా బేగంపేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. చైన్‌మన్‌లు కూడ బెట్టుకున్న అక్రమ అస్తులపై త్వరలోనే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలి


పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఖైరతాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తెలుగుతల్లి వంతెన, లోయర్ ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతోపాటు పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. ఖైరతాబాద్ గణపతి విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో పారిశుధ్య కార్మికులతో కమిషనర్ మాట్లాడారు. ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) హాజరు విధానం పరిశీలించారు. స్వచ్ఛ ఆటోడ్రైవర్లతో మాట్లాడి చెత్త సేకరణ ఎలా చేస్తున్నారని తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు రోజు వస్తున్నారా..? అని సీఐడీ కాలనీవాసులను అడిగారు. పక్కనే ఉన్న పార్కును పరిశీలించి శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ పరిసరాలు, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్(ఎస్‌సీటీపీ)ను సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాచ్‌మన్ మృతి


యాదయ్య(ఫైల్)

అమీర్‌పేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిన స్కూల్ వాచ్‌మన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లోని వాల్మీకినగర్‌కు చెందిన యాదయ్య(46) అమీర్‌పేట ఈస్ట్ శ్రీనివాస నగర్ కాలనీలో ఉంటున్నాడు. నాగార్జున హైస్కూల్లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై బీకేగూడకు వచ్చాడు. తిరిగి స్కూల్‌కు వెళ్తుండగా ఎస్ఆర్‌నగర్‌లో ఓ వ్యక్తి ఎదురు రావడంతో యాదయ్య సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు నీలిమ ఆస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. యాదయ్య కుమారుడు నవీన్‌కుమార్ మెరుగైన వైద్యం కోసం ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరు వెళ్లి వచ్చే సరికి ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): భార్యను తీసుకువచ్చేందుకు ఊరెళ్లి వచ్చేసరికి బంగారు నగలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10 ఇబ్రహీంనగర్‌లో నివసించే ఎస్.రాధాకృష్ణ ఫార్మసిస్ట్. భార్య మానస పుట్టింటికి వెళ్లే ముందు గత నెలలో బంగారు గొలుసు, ఉంగరాలను ఓ పర్సులో పెట్టి అల్మారాలో భద్రపరిచింది. అప్పటి నుంచి రాధాకృష్ణ ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నాడు. గత నెల 26న భార్యను తీసుకువచ్చేందుకు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాడు. ఈనెల ఒకటో తేదీన తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. అల్మారాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 11కేవీ డీఎస్ఎంకాలనీ ఫీడర్ పరిధిలోనూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ శ్రీముఖి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.


వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను దర్శించుకుంటున్న భక్తులు


వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

అమీర్‌పేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో నరేందర్‌రెడ్డి, చైర్మన్ బొడ్డు కుమార్ గౌడ్ ఏర్పాట్లు చేశారు. వైశాఖ శుద్ధ పంచమి శుక్రవారం ఉదయం 8-30 గంటలకు వేదస్వస్తి, శ్రీ విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రిత్విక్ వరణం, ధ్వజారోహణం, గరుడబలి హారతి, గరుడ ప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన తీర్థ ప్రసాద గోష్టి, సాయంత్రం 5గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, అంకురార్పణం, యాగశాలలో కుంభ హవనం, అగ్ని ప్రతిష్ట, పివార దేవతా హోమములు, పారాయణం, నైవేద్యం, హారతి, తీర్థగోష్టి నిర్వహించారు. మొదటి రోజు స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. గర్భగుడిలో ట్రస్టీ చైర్మన్ బొడ్డు కుమార్‌గౌడ్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర్వస్వామి మూల విరాట్ కు స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

యూసుఫ్‌గూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లాల్ బహదూర్ శాస్త్రి సేవానికేతన్ లైబ్రరీ కమిటీ ఆర్థిక సాయం చేయనుంది. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు పి.నరసింహులు, ఇక్బాల్ అహ్మద్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఆధార్‌కార్డు, చిరునామా, రెండు పాస్‌ఫోటోలు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో తీసుకొని గ్రంథాలయం లోగాని, 9295802116లోగాని సంప్రదించాలని వారు సూచించారు.





ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి, దివ్య

ప్రజావాణికి 251 దరఖాస్తులు

బేగంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 251 దరఖాస్తులు అందాయి. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై ఆయా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వచ్చిన అర్జీలను పరిశీలించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 75, విద్యుత్ శాఖకు 23, రెవెన్యూశాఖకు 46, ప్రవాసి ప్రజావాణికి 5, ఇందిరమ్మ ఇండ్ల కోసం 41, ఇతర శాఖలకు చెందిన 61 దరఖాస్తులు అందినట్టు అధికారి తెలిపారు. వీలైనంత వరకు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చిన్నారెడ్డి, దివ్య తెలిపారు.



ట్రోఫీతో బొల్లారం జట్టు

సాకర్ విజేత కేవీ బొల్లారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కేంద్రీయ విద్యాలయ ప్రాంతీయ బాలుర అండర్-14 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కేవీ బొల్లారం జట్టు విజేతగా నిలిచింది. బొల్లారంలో జరిగిన ఈ పోటీల ఫైనల్లో కేవీ బొల్లారం జట్టు 1-0తో కేవీ తిరుమలగిరి జట్టుపై గెలిచి, ట్రోఫీని దక్కించుకుంది. కేవీ హకీంపేట జట్టు మూడో స్థానంతో సరిపెట్టుకుంది. లీగ్ కమ్ నాకౌట్ ఫార్మాట్‌లో జరిగిన ఈ పోటీల్లో మొత్తం పది జట్లు తలపడ్డాయి.



సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి

జాతీయ స్థాయిలో కులగణన గొప్ప పరిణామం

తార్నాక, మే 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో కులగణనను చేపడుతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలోని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యానంతరం సోషలిస్టుల, ప్రజా సంఘాల కులగణన డిమాండ్ మేరకు భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టనున్నట్లు నిర్ణయం తీసుకోవడం గొప్ప పరిణామంగా తమ పార్టీ పరిగణిస్తుందన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల విజయంగా ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ నాయకులు నిమ్మతోట వెంకటేశ్వర్లు, అక్కల బాబుగౌడ్, శ్రీహరి ముదిరాజ్, కోకటి లక్ష్మణ్, బరిగల రామచంద్రుడు, జానం పేట రాములు, మహమ్మద్ యూసుఫ్, మహమ్మద్ నయీమ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రాంగోపాల్‌పేట్ , మే 2 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ జాతీయ స్థాయిలో జనగణనతో పాటు కులగణన చేస్తామని ప్రకటించడంతో సామాజిక న్యాయం కోసం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న నరేంద్రమోదీ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శ్రీ ఉజ్జయినీ మహాకాళీ దేవస్థాన సమీపంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సందీప్ వర్మ అధ్వర్యంలో బీజేపీ శ్రేణులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్, జిల్లా సహ కోశాధికారి ఎస్సార్ మల్లేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ వ్యాస్, డివిజన్ మాజీ అధ్యక్షులు ఆకుల ప్రతాప్, నాయకులు నితేష్ బోలే, దయానంద్, లక్ష్మీనారాయణ కొలెరియా, శ్రీనివాస్ యాదవ్, సందీప్ పాటేల్, అశ్విని, గోపినాద్, శ్రీనివాస్, గోపికిష్ ఉపాధ్యాయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




రామానుజ జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్ శ్రీ లక్ష్మీనారాయణ దేవస్థానంలో నవకలశ స్నపనం, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు - (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)



ఆచార్యులు రామానుజ జయంతి సందర్భంగా ముచ్చింతల్‌లోని రామానుజ ఆశ్రమంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని చిన్న జీయర్ స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి, తదితరులు - తార్నాక, ఆంధ్రజ్యోతి

ఆశలు.. అడియాసలేనా..!

- క్రీడలకు పుట్టినిల్లు.. పోటీలకు మాత్రం ఆమడ దూరం
- ఈసారైనా నిర్వహిస్తారేమోనని ఎదురుచూస్తున్న క్రీడాకారులు
- సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో ఊసేలేని వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు

సికింద్రాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు పుట్టిల్లుగా, క్రీడాకారులకు చిరునామాగా పేరొందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఈ ఏడాది వేసవి క్రీడాశిక్షణ శిబిరాల ఊసే లేకపోవడంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను అందించిన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో చిన్నారులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో, ఔత్సాహిక క్రీడాకారులకు అండగా నిలవడంలో కంటోన్మెంట్ బోర్డు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బైసన్ పోలో గ్రౌండ్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా రూపొందించడానికి కసరత్తు చేస్తున్న కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ చొరవ తీసుకుని, వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ కేంద్ర రక్షణ శాఖ పరిధిలో పనిచేస్తుంది. చుట్టూ ఉన్న జీహెచ్ఎంసీ పరిధితో పోలిస్తే భిన్నమైన పాలన ఉంటుంది. కేంద్ర రక్షణ శాఖ కనుసన్నల్లో పాలన కొనసాగుతున్నందున సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కసరత్తు చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ద్వారా రక్షణ శాఖ అనుమతి తీసుకోవలసిన పరిస్థితి. చుట్టూ ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న ఎన్నో సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు ఇక్కడ పూర్తిస్థాయిలో అమలుకాకపోవడానికి ఇదే ప్రధాన కారణం. ప్రతీ ఏడాది జీహెచ్ఎంసీ జంటనగరాల్లోని పలు ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ, కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మాత్రం ఇప్పటి వరకు ఒక్కటి కూడా నిర్వహించలేదు. రక్షణశాఖ పరిధిలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉంటున్నందున ఇక్కడ క్రీడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా జీహెచ్ఎంసీ చేయడం లేదు. దాంతో కంటోన్మెంట్‌లోని చిన్నారులు, యువత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దూరం కావలసి వస్తోంది. కాగా రెండేళ్ల క్రితం వేసవికి ముందు జరిగిన కంటోన్మెంట్ పాలక మండలి సమావేశంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ప్రస్తావన వచ్చింది. జీహెచ్ఎంసీలో మాదిరిగా కంటోన్మెంట్‌లో కూడా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలన్న అంశమై అప్పటి బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశేఖర్, సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ సుదీర్ఘంగా చర్చించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కూడా ప్రతి ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ అంశాన్ని రక్షణ శాఖ ఉన్నతాధికారులకు పంపించారు. అనంతరం మడ్‌ఫోర్టు, బొల్లారం, తిరుమలగిరిలలోని కంటోన్మెంట్ క్రీడా మైదానాల్లో శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఒక్కో మైదానంలో కొన్ని క్రీడల చొప్పున చిన్నారులకు, యువతకు శిక్షణనిచ్చి, శిబిరాలను విజయవంతంగా నిర్వహించారు. దాంతో ఏటా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తారని అంతా ఆశించారు. అయితే వారి ఆశలను అడియాసలు చేస్తూ మరుసటి ఏడాది (గత వేసవి)లో శిక్షణ శిబిరాలను నిర్వహించలేదు. దాంతో కనీసం ఈ సారైనా నిర్వహిస్తారని అంతా భావించారు. అయితే ఇప్పటి వరకు అటు కంటోన్మెంట్ బోర్డు అధికారులుగాని, ఇటు ప్రజా ప్రతినిధులు గాని ఈ అంశమై ఆలోచన కూడా చేయకపోవడం చిన్నారులను, ఔత్సాహిక క్రీడాకారులను ఆవేదనకు గురిచేస్తోంది. క్రీడావ్యాప్తికి, క్రీడా పోటీల నిర్వహణకు అనువైన వాతావరణం ఉన్నప్పటికీ దీనిని సద్వినియోగం చేసుకోకపోవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

లబ్ధిదారులకు వేగంగా చెక్కుల పంపిణీ : శ్రీగణేష్



లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే

సికింద్రాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎంతో జాప్యం జరిగేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చాలా వేగంగా చెక్కుల పంపిణీ జరుగుతున్నదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు చిత్తశుద్ధి వలన లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతున్నదని పేర్కొన్నారు.

పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 42 మంది అర్హులకు ఆయన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మంచి పని చేసినా విమర్శలు చేయడం, నిందలు మోపడం ప్రతిపక్షాలు అలవాటు చేసుకున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పేదల సంక్షేమం పట్ల వెనుకడుగు వేయడం లేదని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు నోటీసులు



తిరుమలగిరి ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు

బోయినపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో ఉండని, కిరాయిలకు ఇచ్చిన వారికి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల నుండి 2 రోజుల క్రితం నోటీసులు జారీ అయ్యాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అలాట్ చేసినప్పటికీ కొంతమంది నివసించకుండా కిరాయిలకు ఇచ్చి బయట ఉంటున్న విషయం సంబంధిత జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. సుమారు 608 మందిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించగా వారిలో ఇప్పటివరకు 215 మందికి ఆర్డీఓ కార్యాలయం నుండి నోటీసులు జారీ కాగా తిరుమలగిరి ఎమ్మార్వో వారికి రెండు రోజుల క్రితం సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. వారికి కేటాయించిన ఇండ్లలో ఎందుకు ఉండటం లేదో పూర్తి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు ఎమ్మార్వో తెలిపారు. లబ్ధిదారుల వివరణ ప్రకారం నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తిరిగి ఆ ఇళ్లను ఎవరికి కేటాయించాలి లేక ఇందిరమ్మ పథకం కింద అర్హులకు అందజేయాలనే అంశంపై ప్రభుత్వం తుదినిర్ణయం ఉంటుందని ఎమ్మార్వో పేర్కొన్నారు. రాజీవ్ యువవికాసం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నవారు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు నాలుగు కౌంటర్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తులు అందజేయని వారివి తిరస్కరించబడుతాయని ఆమె తెలిపారు.



ఆడపిల్లల సమానత్వ సమాఖ్య కమిటీ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ స్వామి

ప్రతీ ఒక్కరు ఉన్నత చదువులు చదవాలి: స్వామి

అడ్డగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి చదువు ముఖ్యమని ఎంవీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఏవీఎం స్వామి అన్నారు. అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య కమిటీ మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలకార్మికులనిర్మూలనకు పోరాటం చేస్తున్నామని డ్రాపౌట్ పిల్లల్ని బడిలోకి పంపించేందుకు తమ సంస్థ పనిచేస్తుందన్నారు. తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య జిల్లా సభ్యురాలు సువర్ణ మాట్లాడుతూ, ఆడపిల్లల సమస్యలు లింగ సమానత్వం గురించి మాట్లాడడం పద్ధతుల ఆచరణల గురించి పదో తరగతితోనే ఆగకుండా ప్రతీ ఒక్కరు ఉన్నత చదువులు చదవాలన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలవుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. 1098 కానీ 100 కానీ పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. మురికివాడ బస్తీల్లో గంజాయి విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మేయర్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న ముప్పిడి నవీన్‌కుమార్

టౌన్ ప్లానింగ్ మున్షీలపై చర్యలు తీసుకోవాలి : నవీన్‌కుమార్

బేగంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): టౌన్ ప్లానింగ్‌లో అవినీతికి పాల్పడుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న చైన్‌మెన్ (మున్షీ)లపై చర్యలు తీసుకోవాలని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి లిఖిత పూర్వక ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బేగంపేట, సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ ప్రాంతాల్లో 20 ఏళ్లుగా చైన్‌మెన్‌లు ఒకేచోట పనిచేస్తున్నారన్నారు. వీరు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనికి స్పందించిన మేయర్ త్వరలో చైన్‌మెన్‌లను బదిలీ చేయబోతున్నామన్నారని పేర్కొన్నారు. వారి అక్రమ ఆస్తులపై ఆధారాలతో సహా అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి : అరవింద్



కంటోన్మెంటు బోర్డు సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న అరవింద్

తిరుమలగిరి మే 2 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంటు బోర్డు పరిధిలోని 8వ వార్డులో పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జి.అరవింద్ కుమార్ కంటోన్మెంటు బోర్డు సీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి జరుగుతున్నా.. వార్డు-8లో మాత్రం అభివృద్ధి శూన్యం అని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు వివరించినట్లు అరవింద్ పేర్కొన్నారు. ముఖ్యంగా డౌటన్‌బజార్ జయశంకర్ విగ్రహం, చింతల్ బజార్, చింతల్ బజార్ గంగపుత్ర సంఘం, ఆదర్శ్ నగర్, రిసాల బజార్, యాదవ్ సంఘం ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆ ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు. త్వరలోనే పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యంను అరవింద్ రిసాలబజార్ లోని రేషన్ షాపులో పేద వర్గాలకు పంపిణీ చేశారు.

తాగునీటిలో డ్రైనేజీ నీళ్లు..!



నిరసన వ్యక్తం చేస్తున్న బస్తీవాసులు



తాగునీటి మ్యాన్‌హోల్‌లో కలుషిత నీరు

అడ్డగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట గరీబోళ్ల బస్తీలో ముప్పై ఏళ్ల క్రితం వేసిన మంచినీటి పైప్‌లైన్‌లు తుప్పుపట్టి పోవడంతో తాగునీటిలో డ్రైనేజీ నీళ్లు కలుస్తున్నాయని అడ్డగుట్ట ఏ సెక్షన్ బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఇరవై ఇండ్లలో రోజు విడిచి రోజు సరఫరా అవుతున్న మంచినీటి నల్లాల్లో డ్రైనేజీ పైపుల నీరు కలవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని, కొత్త పైప్‌లైన్ వేయాలని ఎన్నోసార్లు మారేడుపల్లి జలమండలి అధికారులకు, అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. గురువారం సరఫరా అయిన నీళ్లలో రంగు నీళ్ల రావడంతో మంచినీరు కొనుక్కోవలసి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఈ డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి మంచినీటి పైప్‌లైన్ వేరు చేసి కొత్త పైప్‌లైన్ ద్వారా నీళ్లు అందించాలని లేదంటే సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు క్యాంప్ కార్యాలయం వద్ద అడ్డగుట్ట నుంచి 100 మందిమి ధర్నా చేస్తామని అడ్డగుట్ట వాసులు హెచ్చరించారు.

మహిళను కట్టేసి బంగారు నగలు, నగదు చోరీ

వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన



బాధితురాలు పారిజాతం

బౌద్ధనగర్, మే2 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలంటూ ఇంట్లోకి చొరబడిన ఇద్దరు అగంతుకులు ఓ మహిళను కట్టివేసి బంగారు నగలు, నగదు, సెల్‌ఫోన్‌ను దోచుకుని వెళ్లిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్, స్థానికుల వివరాల ప్రకారం.. పార్శీగుట్టలో పారిజాతం (56) అనే మహిళ ఇంట్లో మొదటి అంతస్తులో నివసిస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇల్లు అద్దెకు కావాలంటూ ఇంట్లోకి చొరబడ్డారు. తలుపులకు గడియపెట్టి, ఆమెను కత్తితో బెదిరించి టేపుతో కుర్చీలో కట్టివేశారు. ఇంట్లో ఉన్న ముప్పై గ్రాముల బంగారు నగలు, ఆరువేల నగదు, సెల్‌ఫోన్ తీసుకుని అక్కడనుండి ఉడాయించారు. ఆ తర్వాత మహిళ కట్లను విప్పుకుని ఇంట్లో నుండి కిందికి వచ్చి బోరున విలపిస్తూ స్థానికులకు విషయాన్ని తెలిపింది. శుక్రవారం బాధితురాలు వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, అడ్మిన్ ఎస్సై సుధాకర్, డిటెక్టివ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కోసం బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు.

మార్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా రాంచందర్



రెజిమెంటల్‌బజార్, మే 2 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ ఇన్స్‌పెక్టర్‌గా రాంచందర్ బాధ్యతలు స్వీకరించారు. 2002 సంవత్సరంలో పోలీస్ శాఖలో ఎస్సైగా చేరి బేగంపేట్, తుకారంగేట్, మీర్‌చౌక్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లలో పనిచేశారు. 2017లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది కాలాపత్తార్, సైఫాబాద్, గోపాలపురం, అబిడ్స్, సైఫాబాద్‌లో పనిచేశారు. ఆయన బేగంపేట ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నుండి మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ గుడిమల్కాపూర్‌కు బదిలీపై వెళ్లారు.

బోయినపల్లి సీఐగా తిరుపతి రాజు బాధ్యతల స్వీకరణ



లక్ష్మీనారాయణరెడ్డి నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతి

బోయినపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి పోలీస్ స్టేషన్ సీఐగా తిరుపతిరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ నుండి బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి నుండి తిరుపతి రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐ శివశంకర్, నాగేంద్రబాబు నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను అదుపు చేయడం కోసం కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, వ్యాపారస్తులతో కలిసి ఈ ప్రాంతంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి కృషి చేస్తామని తెలిపారు.

నేడు ప్రకాశ్‌నగర్ రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ

బేగంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట ప్రభుత్వం పేద ప్రజల కోసం సన్నబియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుధాం అన్నారు. బేగంపేట డివిజన్‌లోని ప్రకాశ్‌నగర్ రేషన్ దుకాణంలో శనివారం పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ బండి రమేష్ హాజరుకానున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ప్రజలకు ఈ పథకం గురించి వివరించాలన్నారు.



రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో చుట్టాల బస్తీలోని రేషన్ షాపులో ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మల్లిఖార్జున్. కార్యక్రమంలో శ్రీకాంత్ చారి, వెంకట్, రహీం, రఘు యాదవ్, వినయ్, కృష్ణ, వెంకట్ ముదిరాజ్, నర్సింగరావు తదితరులు - రాంగోపాల్‌పేట, ఆంధ్రజ్యోతి



ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
జి.అంజయ్య: 9985921364